# సాక్షి ప్రకాశం

శుక్రవారం । 29 । మార్చి । 2024

I




**పెళ్లింట అంతులేని విషాదం**

కుమార్తె వివాహం చేసి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి వధువు తల్లితో పాటు మరో ఇద్దరు బంధువులు మృతిచెందారు - IIలో..



**చెక్‌పోస్టుల వద్ద గస్తీ పటిష్టం**

ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద గస్తీని పటిష్టం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. చెక్‌పోస్టు, పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
35.3/26


**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పగలు ఉక్కపోతగా ఉంటుంది.

**రంజాన్ వేళలు**

శుక్రవారం - ఇఫ్తార్ : సా॥ 6.27

శనివారం - సహరీ : ఉ॥ 4.46



**న్యూస్‌రీల్**

## పోస్టల్ బ్యాలెట్ కోసం ఏప్రిల్ 22లోపు దరఖాస్తు చేసుకోవాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

**ఒంగోలు అర్బన్:** పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే వారు ఏప్రిల్ 22వ తేదీలోపు సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) వద్ద దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. అత్యవసర సర్వీసుల్లో ఉండే 33 శాఖల ఉద్యోగులకు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిన నేపథ్యంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో గురువారం కలెక్టరేట్‌లోని స్పందన భవనంలో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజు అత్యవసర సేవలు నిర్వహించాల్సి ఉండటం వల్ల ప్రత్యక్షంగా ఓటు వేసే అవకాశం లేని వాళ్ల పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయవచ్చన్నారు. అందుకోసం ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన ఐదు రోజుల్లోపు నియోజకవర్గ ఆర్ఓలకు ఫారం-12(డి) అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్ఓ శ్రీలత, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక పోరుకు..

# సమగ్ర ప్రణాళిక

సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. పోలింగ్‌కు ఇంకా 46 రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ సిబ్బందిని నియమించారు. ఎలాంటి అక్రమాలు జరగకుండా నిఘా ఉంచారు. పొరుగు ప్రాంతాల నుంచి నగదు, మద్యం రాకుండా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

● పక్కాగా ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు
● నిబంధనల అమలుకు పటిష్ట చర్యలు
● సి-విజిల్, సువిధ యాప్‌ల ద్వారా ఫిర్యాదులు, అనుమతులు
● 263 మంది సెక్టోరల్ అధికారులు
● సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి




కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**ఒంగోలు అర్బన్:** శాంతియుత వాతావరణంలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఆదేశాలు, నిబంధనలు పక్కాగా అమలు చేసేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నారు. ఎలాంటి పొరపాట్లు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రస్ఫుటించేలా నిష్పాక్షికతతో ఎన్నికలు నిర్వహించాలని సూచిస్తున్నారు. ఈ నెల 16వ తేదీ సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు, ఉద్యోగులు ఎన్నికల నిర్వహణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేలకుపైగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల విధుల్లో కీలకమైన సెక్టోరల్ ఆఫీసర్లుగా 263 మందిని నియమించారు. సరాసరి ప్రతి పది పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టోరల్ ఆఫీసర్ చొప్పున నియమించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే సెక్టోరల్ అధికారులకు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలు ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ ఎన్నికల సంఘానికి నివేదిక పంపారు. ఓటరు జాబితాకు సంబంధించి ఫారం-7, 8 దరఖాస్తులను నూరు శాతం పరిష్కరించారు. దీంతో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియ పూర్తి చేశారు. ఇక కేవలం కొత్త ఓట్లు నమోదు చేసుకునేందుకు మాత్రమే అవకాశం ఉంది.

జిల్లా కేంద్రంలోని ప్రకాశం భవనంలో ఎన్నికల కంట్రోలు రూము ఏర్పాటు చేశారు. దీనిలో పలు రకాల సేవలు, పరిశీలనలు చేస్తారు. సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు తీసుకుని 100 నిమిషాల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకూ సి-విజిల్ ద్వారా 270 ఫిర్యాదులు రాగా, వాటిని పరిశీలించి పరిష్కరించారు. అన్ని రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించే ముందు సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. నిబంధనలన్నీ పరిశీలించి సువిధ యాప్ ద్వారా అనుమతులు ఇస్తున్నారు. 8 మంది ఆర్‌ఓల పరిధిలో ఇప్పటికి 266 దరఖాస్తులు రాగా వాటిలో 149 మంజూరు చేయగా, 48 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. మిగిలినవి ప్రాసెస్‌లో ఉన్నాయి. ఈ సేవలతో పాటు 1950 టోల్ ఫ్రీ నంబర్, వ్యయ కమిటీలు, స్వీప్, మీడియా మానిటరింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, సింగిల్ విండో అనుమతులు వంటి సేవలు కంట్రోలు రూములో ఏర్పాటు చేశారు.

**జిల్లాలో 18 చెక్‌పోస్టులు...**

ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు దొడ్డిదారిలో డబ్బు, మద్యం, ఇతర వస్తువులు రాకుండా ఉండేలా నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో సిగరాయకొండ-ఉలవపాడు మధ్య, నాగులుప్పలపాడు, మద్దిపాడు, చిన కనమళ్ల, పొన్నలూరుతో పాటు అంతర్‌జిల్లా సరిహద్దు ప్రాంతాలలో మొత్తం 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టుల వద్ద మూడు షిఫ్టుల్లో ఐదుగురు చొప్పున పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ ఒక్కో షిఫ్ట్‌లో 200 చొప్పున వాహనాలు తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేలా అధిక మొత్తంలో డబ్బు, మద్యం, ఇతర వస్తువులను పట్టుకునేలా తనఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకూ రూ.1.80 కోట్ల నగదు, బంగారం, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 887 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసుకున్నారు. మరో 144 మందిని బైండోవర్ చేసుకోవాల్సి ఉంది. గ్రామాల్లో ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) గురించి అవగాహన కల్పిస్తున్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో సాయుధ దళాలతో స్థానిక పోలీసులను కలుపుకుని కవాతు నిర్వహిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానాస్పదంగా ఉన్నవారు, రౌడీషీటర్లు జిల్లాలోకి వస్తే ఆయా జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుని వారిపై కూడా పూర్తి స్థాయిలో నిఘా ఉంచారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

**పోలింగ్‌కు 15 వేల మంది...**

జిల్లాలో 263 సెక్టోరల్ అధికారులను నియమించారు. వీరితో పాటు నియోజకవర్గానికి ఒక ఆర్‌ఓ చొప్పున 8 మంది, 46 మంది ఏఆర్‌ఓలు, 16 మంది జిల్లా స్థాయి నోడల్ అధికారులను ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి 3 నుంచి 4 చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, సర్వేలెన్స్ బృందాలు 16, అకౌంటింగ్ బృందాలు 8, అసిస్టెంట్ అబ్జర్వర్లు 16 మందితో పాటు పోలింగ్ సిబ్బంది కోసం సుమారు 15 వేల మందికిపైగా సిద్ధం చేశారు. వీరితో పాటు 50 మంది జిల్లా అధికారులు, 25 మంది మండల స్థాయి అధికారులు ఎన్నికల విధుల్లో పనిచేస్తున్నారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మార్చి 16వ తేదీ నాటికి 18,11,614 మంది ఓటర్లు ఉన్నారు. 2,183 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

| | |
|---|---|
| ఓటర్లు : 18,11,614 మంది | |
| పురుషులు : 9,02,521 మంది | |
| మహిళలు : 9,08,986 మంది | |
| థర్డ్ జెండర్లు : 107 మంది | |
| ఎన్నికల విధుల్లో : 20 వేల మంది | |
| పోలింగ్ కేంద్రాలు | చెక్‌పోస్టులు |
| 2,183 | 18 |

**ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**



ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి పనిచేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నాం. కమాండ్ కంట్రోలు రూము ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్నాం. కంట్రోలు రూములో అవసరమైన అన్ని విభాగాలు ఏర్పాటు చేశాం. సింగిల్ విండో, సువిధ ద్వారా రాజకీయ పార్టీలు, పోటీలో ఉండే అభ్యర్థులకు అవసరమైన అనుమతులు మంజూరు చేస్తున్నాం. సి-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులకు 100 నిమిషాల్లో పరిష్కారం చూపుతున్నాం. జిల్లా సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషనర్‌కు నివేదిస్తున్నాం. శాంతిభద్రతలు, అక్రమ డబ్బు, మద్యం ఇతర వస్తువులు రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం.

– ఏఎస్ దినేష్‌కుమార్,
కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

# ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

● నా చివరి శ్వాస వరకూ వారిని ఆదుకుంటా
● ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
● వైఎస్సార్ సీపీలో చేరిన 200 మంది ఆర్యవైశ్యులు



ఆర్యవైశ్యులకు పార్టీ కండువాలు వేసి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రణీత్‌రెడ్డి

**ఒంగోలు టౌన్:** ఆర్యవైశ్యులకు ఎలాంటి కష్టమొచ్చినా నేను తోడుగా నిలబడతా.. నా చివరి శ్వాస వరకు అండగా ఉంటా అని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక బాలినేని నివాసంలో గురువారం 200 మంది ఆర్యవైశ్యులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ మొదటి నుంచి తనకు ఆర్యవైశ్యులంటే ప్రేమ, అభిమానం ఉందన్నారు. ఒంగోలులో వారికి ఏ సమస్య వచ్చినా అండగా నిలబడుతున్నానని చెప్పారు. నగరంలోని ఆర్యవైశ్యులకు ఆరామక్షేత్రం లేదని, అందుకోసం స్థలం కావాలని అడిగితే వెంటనే స్పందించి నగరం నడిబొడ్డును స్థలాన్ని కేటాయించామని గుర్తు చేశారు. రెండు దశాబ్దాలకుపైగా కొనసాగుతున్న గోశాల సమస్యను పరిష్కరించి ఆర్యవైశ్యులకు అప్పగించడం జరిగిందన్నారు. త్వరలో బాపూజీ కాంప్లెక్స్ రెగ్యులరైజేషన్ చేయించడం జరుగుతుందని చెప్పారు. నగరంలో బాపూజీ కాంప్లెక్స్‌ను దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ప్రారంభించారని, ఆయన చనిపోయినప్పుడు ఒంగోలు నగరంలో రోశయ్య విగ్రహం ఏర్పాటు చేసుకుంటామని అసెంబ్లీలో ప్రకటించానని చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలనలో ఆర్యవైశ్యుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా ప్రశాంతంగా వ్యాపారాలు చేసుకునేందుకు ప్రోత్సహించారన్నారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, ఈ విషయాన్ని జాతీయ సర్వేలన్నీ వెల్లడిస్తున్నాయని చెప్పారు. ఆర్యవైశ్యులకు మేలు చేసే మరిన్ని పనులు చేస్తానని బాలినేని హామీ ఇచ్చారు. నగరంలోని నిరుపేద ఆర్యవైశ్యులకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించడం జరిగిందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తన గెలుపు కోసం కృషి చేయాలని, వైఎస్సార్ సీపీని గెలిపించే బాధ్యత తీసుకోవాలని కోరారు.

**పార్టీలో చేరికలతో నూతనోత్సాహం...**

నగరంలోని 200 ఆర్యవైశ్యులు వైఎస్సార్ సీపీలో చేరడంతో కోలాహల వాతావరణం, పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం కనిపించింది. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పండుగ వాతావరణం ఉట్టిపడింది. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, యువనేత ప్రణీత్‌రెడ్డి పార్టీలో చేరిన ప్రతిఒక్కరినీ అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, జె.కృష్ణ, కారంశెట్టి కిరణ్, తడవర్తి వాసు, మునగా కృష్ణారావు, మట్ట హర్ష, వైఎస్సార్ సీపీ నాయకులు కటారి శంకర్, మాజీ ఎమ్మెల్యే కుసుకుర్తి ఆదెన్న, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ వెంకయ్య, గంటా రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పథకాలు చూడండి.. ఓటేసి గెలిపించండి

● మంత్రి మేరుగు నాగార్జున వినూత్న ప్రచారం
● ఇంటింటా లబ్ధిదారులతో పథకాలపై ఆరా
● వీధుల్లో చిరువ్యాపారులు, వృత్తి పనివారికి భరోసా



ఇస్త్రీ చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

**చీమకుర్తి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వస్తున్నాయా అమ్మా..? ప్రతి నెలా ఒకటో తేదీ పింఛన్ ఇస్తున్నారా..? అమ్మ ఒడి, చేయూత వంటి పథకాల డబ్బు నేరుగా బ్యాంక్ ఖాతాలో వేస్తున్నారు కదా... అంటూ సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున చీమకుర్తి పట్టణంలోని 1, 2, 3 వార్డుల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారం ఓటర్లను ఆకట్టుకుంది. అంతేగాకుండా వీధుల్లో చిరువ్యాపారులు, వృత్తి పనివారు, చర్మకారులు, ఇస్త్రీ చేసే వారిని ఆప్యాయంగా పలకరిస్తూ వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పథకాలు, వాటిని అమలు చేసే విధానాలను చూసి వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేస్తున్న తనను ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని మంత్రి మేరుగు నాగార్జున కోరారు. పార్టీ జెండాలతో చీమకుర్తిలోని మూడు వార్డుల్లో తిరిగారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా అమలు చేసిన సంక్షేమ పథకాల వలన ప్రతి ఇంటికి లబ్ధి కలిగిందని ఓటర్లకు వివరించారు. పార్టీ గుర్తు ఫ్యాన్‌ను చూపిస్తూ సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, స్థానిక కౌన్సిలర్లు తప్పెట బాబూరావు, పాటిబండ్ల గంగయ్య, బీమన వెంకట్రావు, సోమా శేషాద్రి, నలమలపు మాణిక్యం, పాలడుగు సుబ్బారావు, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, దాసరి లక్ష్మీనారాయణ, మంచా హరికృష్ణ, గోపురపు చంద్ర, అత్యాల దావీదు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# లైసెన్స్‌డ్ ఆయుధాలు డిపాజిట్ చేయించాలి

● లైసెన్స్ లేని ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవాలి
● అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన ఎస్పీ పరమేశ్వరరెడ్డి

**ఒంగోలు అర్బన్:** జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో లైసెన్స్‌డ్ ఆయుధాలను తిరిగి డిపాజిట్ చేయించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కొత్తగా ఎటువంటి లైసెన్స్‌లు మంజూరు చేయవద్దని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు లైసెన్స్‌డ్ ఆయుధాలు డిపాజిట్ చేయించి లైసెన్స్ లేని ఆయుధాలు, ఇతర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. వాటి రవాణాను అడ్డుకోవడం, తదితర అంశాలపై జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ శ్రీలత, జిల్లా జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డి, ఇతర అధికారులతో కలిసి స్థానిక ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత లైసెన్స్‌డ్ ఆయుధాలను అందరూ తిరిగి డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్‌ల జారీ, ఆయుధాల రకాలకు సంబంధించిన వివరాలతో కూడిన రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలన్నారు. పోలీసు, రెవెన్యూ అధికారుల మధ్య కామన్ డేటా ఉండాలని సూచించారు. లైసెన్స్‌దారులు మరణిస్తే వారి వద్ద ఉన్న ఆయుధాల స్థితిగతులు, రాజకీయ నేపథ్యం ఉన్న ఖైదీలు జైలు నుంచి ప్రతి వారం కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కాలేడేటా వివరాలపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. శాంతియుత ఎన్నికల నిర్వహణపై ఇటువంటి ఖైదీలు ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపకుండా నిఘా ఉంచాలన్నారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ లైసెన్స్‌దారులు ఆయుధాలను డిపాజిట్ చేసేలా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి లైసెన్స్ ఆయుధంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. గుర్తింపు లేని ఆయుధాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అటువంటి ఆయుధాలు రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఉంచామన్నారు. జైలులో ఖైదీల నేర చరిత్ర, రాజకీయ నేపథ్యం వివరాలను సంబంధిత అధికారుల ద్వారా తీసుకుని అటువంటి ఖైదీల అనుచరుల కదలికలపై నిఘా పెట్టామన్నారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

# సంక్షేమ సామ్రాట్.. సీఎం జగన్

● మోసం చేయడం చంద్రబాబు నైజం
● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్
● పొన్నలూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



సభలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

**పొన్నలూరు:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలతో పాటు అన్ని వర్గాల పేద ప్రజల అభ్యున్నతికి నవరత్న పథకాలతో నవశకం పూరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సామ్రాట్‌గా నిలిచారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. పొన్నలూరులో గురువారం వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని మంత్రి సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సురేష్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్న పథకాలతో గ్రామాల్లోని ప్రతి కుటుంబం అభివృద్ధి చెందిందన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యాదీవెన, ఇళ్ల స్థలాలు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, రైతు భరోసా, ఆరోగ్య శ్రీ వంటి పథకాలు రాష్ట్ర ప్రజల జీవన పరిస్థితులను ఎంతగానో మెరుగుపరిచాయన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు మంచి చేయడంతో పాటు మహిళల ఆర్థిక పరిస్థితులు, గౌరవాన్ని పెంచామన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో పేదవాడి సంక్షేమం శూన్యమన్నారు. అలాగే ఎన్నికల సమయంలో వందల కొద్ది హామీలు గుప్పించి ఎన్నికల ముందు ఒకలా.. ముగిసిన తర్వాత మరోలా ప్రవర్తించే ఏకైక వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి అవినీతి, అక్రమాలకు చంద్రబాబు పెద్దపీట వేస్తే.. సంక్షేమానికి, అభివృద్ధికి జగనన్న పెద్దపీట వేసి గ్రామాల రూపురేఖలు మార్చారన్నారు. రాష్ట్రంలో రాజన్న రాజ్యం కొనసాగాలంటే ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకే ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు.

**గెలుపే లక్ష్యంగా పనిచేయాలి...**

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త నిబద్ధత, పట్టుదలతో కృషి చేయాలని మంత్రి సురేష్ కోరారు. గ్రామాల్లో టీడీపీ నాయకులు కుట్రలు, కుయుక్తులతో కులాల మధ్య చిచ్చుపెట్టి మభ్యపెడుతున్నారని, లేనిపోని హామీలు గుప్పిస్తున్నారని, వాటిని ఎవరూ నమ్మవద్దని అన్నారు. ప్రతి కార్యకర్త గడప గడపకు తిరిగి జగనన్న చేసిన మేలును ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, జేసీఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు మన్నెం రవణయ్య, మండల మాజీ కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గొల్లపూడి రవణయ్య, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కంచర్ల రవణయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరాధార వార్తలు రాస్తే చర్యలు

● వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర గ్రూపుల్లో అవాస్తవాలు ప్రచురించకూడదు
● అలా ప్రచురిస్తే గ్రూపు అడ్మిన్‌లదే బాధ్యత
● హెచ్చరించిన ఎస్పీ పరమేశ్వరరెడ్డి



ఎస్పీ పరమేశ్వరరెడ్డి

**ఒంగోలు సబర్బన్:** రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సామాజిక మాధ్యమాల్లో నిరాధార, వాస్తవ దూరమైన కథనాలు ప్రచారం చేస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ పీ పరమేశ్వరరెడ్డి హెచ్చరించారు. అందుకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికలు-2024ను నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్స్, తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. సరైన సమాచారం లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా నిరాధార వార్తలు, వాస్తవ దూరమైన పోస్టులు, వీడియోలు, వార్తలను సామాజిక మాధ్యమాల్లో ఉంచితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ (ఎక్స్), ఇతర గ్రూపుల్లో ఎవరైనా ఏదైనా అనాలోచిత, తప్పుడు సమాచారం, బెదిరింపులకు పాల్పడేవి పోస్ట్ చేయబడితే దానికి పూర్తి బాధ్యత గ్రూప్ అడ్మిన్ వహించాల్సి వస్తుందన్నారు. అలాంటి పోస్టులు పెడితే జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్-91211 02266కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### హంస వాహనంపై దేవదేవుడు



కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం వెంకటేశ్వరస్వామివారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పల్లకి మోసి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం శ్రీవారు శేష వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

### సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

- జూన్ 1 నుంచి కళాశాల పునః ప్రారంభం
- ఆర్ఐఓ సైమన్ విక్టర్

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియెట్ విద్యా మండల కార్యదర్శి ఉత్తర్వుల మేరకు అన్ని యాజమాన్య పరిధిలోని జూనియర్ కళాశాలకు ఈ నెల 29 నుంచి వేసవి సెలవులు ప్రకటిస్తున్నట్లు ఆర్ఐఓ ఎ. సైమన్ విక్టర్ తెలిపారు. జూన్ 1 నుంచి జూనియర్ కళాశాలలను పునః ప్రారంభమవుతాయని చెప్పారు. బోర్డు ఆదేశాలను ఉల్లఘించి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తరగతుల పేరిట అడ్మిషన్లు, కోచింగ్ పేరుతో ఎలాంటి ప్రత్యేక తరగతులు నిర్వహించినా బోర్డు తీసుకునే కఠిన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. అపరాధ రుసుం విధించడంతో పాటు సంబంధిత కళాశాలల గుర్తింపును సైతం రద్దు చేస్తామన్నారు.

### కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి

- రూ.2 లక్షలు నష్టం



సీతారాంపురంలో కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

హనుమంతునిపాడు: పిచ్చి కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి చెందాయి. ఈ సంఘటన సీతారాంపురం పంచాయతీ దేవిరెడ్డివారిపల్లిలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన నూనె గురవయ్య, మల్లెబోయిన తెల్లయ్య, వేమవరపు పాలయ్యకు చెందిన గొర్రె పిల్లలను తడికల దొడ్డిలో తోలి ఉంచారు. దొడ్డిలో కుక్కలు పడి దాడి చేశాయి. దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి చెందాయి. వాటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని పోషకులు ఆవేదన వ్యక్తం చేశారు.

# పెళ్లింట అంతులేని విషాదం

- సూరారెడ్డిపాలెం వద్ద రోడ్డు ప్రమాదం
- ప్రమాదంలో పెళ్లి కూతురు తల్లి, ఇద్దరు బంధువులు మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- మృతులు కందుకూరు వాసులు
- వివాహానికి హాజరై తిరుగువస్తుండగా తెల్లవారుజామున ప్రమాదం
- కందుకూరుకు చెందిన యువతికి, ఖమ్మం జిల్లా పాల్వంచకు చెందిన యువడితో వివాహం



అంత్యక్రియలకు అంబులెన్స్‌లో తీసుకొచ్చిన మృతదేహాలు

కందుకూరు: అప్పటి వరకు పెళ్లింట ఎంతో సంతోషం గడిపిన ఆ కుటుంబాన్ని విధి చిన్నచూపు చూసింది. కుమార్తెకు పెళ్లి చేసి బాధ్యత తీర్చుకున్నానని సంతోషపడే లోపే రోడ్డు ప్రమాదం రూపంలో ఆ కుటుంబంలో అంతులేని విషాదం అలుముకుంది. పెళ్లి పీటలు ఇంకా దిగక ముందే తల్లి, బంధువులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్న వార్తతో కొత్త పెళ్లి కూతురు తల్లడిల్లిపోయింది. ఇదీ గురువారం సూరారెడ్డిపాలెం వద్ద జరిగిన రోడ్డులో ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబంలో చోటు చేసుకున్న విషాదం.

ప్రస్తుతం కందుకూరు పట్టణంలోని విప్పగుంటలో నివాసముంటున్న రాయని అరుణ, రమణయ్య కుమార్తె రాయని స్రవంతి. రమణయ్య దాదాపు 20 ఏళ్ల క్రితమే భార్యతో విబేధించి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి పట్టణంలోని కోవూరు రోడ్డులో టిఫిన్ దుకాణం నిర్వహించుకుంటూ తన ఇద్దరి పిల్లలను పెంచి పెద్ద చేసింది. ఈ క్రమంలో స్రవంతికి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా పాల్వంచకు చెందిన అశేష్ అనే యువకుడితో వివాహం నిశ్చయమైంది. బుధవారం రాత్రి పాల్వంచలోని వరుడి ఇంట్లో ఘనంగా వివాహమైంది. పెళ్లి తర్వాత అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో అరుణతో పాటు కుమారుడు వేణుగోపాల్, తన మేనల్లుడైన వినోద్, అతని భార్య దివ్య, వీరి కుమారుడు మణి, మరో బంధువు గుళ్లాపల్లి శ్రావణి అనే యువతి అందరూ కలిసి కారులో కందుకూరు బయలుదేరారు. వేణుగోపాల్ కారు నడుపుతుండగా, మిగిలిన వారు వెనుక సీట్లలో కూర్చున్నారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున 6 గంటల ప్రాంతంలో సూరారెడ్డిపాలెం వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ప్రమాదంలో రాయని అరుణ(50), తల్లపనేని దివ్య(30) గుళ్లాపల్లి శ్రావణి(22) అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న వేణుగోపాల్, వినోద్, చిన్న పిల్లవాడు మణిలు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఒంగోలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు.

**అప్పటి వరకు సంతోషం..అంతలోనే..**

అయితే అప్పటి వరకు పెళ్లి పనులతో తీరిక లేకుండా గడిపిన వారు అంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. పెళ్లి పీటల మీద నుంచే తల్లి అరుణకు, అన్న వేణుగోపాల్‌కు, మిగిలిన బంధువులకు టాటా చెప్పిన స్రవంతికి కొన్ని గంటలు కూడా గడక ముందే రోడ్డు ప్రమాదంలో మరణించారన్న వార్త కొత్త పెళ్లి కూతురు జీవితంలో మరువలేని సంఘటనగా మిగిలింది. ఇక ఈ ప్రమాదంలో మృతి చెందిన తల్లపనేని దివ్య మరో విషాద గాథ. భర్త వినోద్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. భర్త, తన ఐదేళ్ల కుమారుడు మణితో కలిసి బెంగళూరులోనే వీరు నివాసం ఉంటున్నారు. మేనత్త కుమార్తె వివాహం కావడంతో వినోద్ కుటుంబంతో కలిసి రెండు రోజుల క్రితమే కందుకూరు వచ్చాడు. అయితే ఊహించని ప్రమాదంలో దివ్య మృతి చెందగా, వినోద్, వీరు కుమారుడు మణి తీవ్ర గాయాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు.

**ఉద్యోగ ప్రయత్నంలో ఉండగానే..**

పెళ్లి కోసమే హైదరాబాద్ నుంచి వచ్చిన గుళ్లాపల్లి శ్రావణి అనే యువతి మృతి తల్లిదండ్రులకు మింగుడు పడని సంఘటనగా మారింది. వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మీల కుమార్తె శ్రావణి. వీరి కుటుంబం చాలా కాలంగా హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. శ్రావణి ప్రస్తుతం డిగ్రీ పూర్తి చేసుకుని ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. స్రవంతి పెళ్లి కోసమని శ్రావణి కందుకూరు వచ్చింది. అంతలోనే రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడింది.

**వేణుగోపాల్‌కు తీవ్ర గాయాలు**



ప్రమాదంలో మృతి చెందిన శ్రావణి (ఫైల్)



అంత్యక్రియలకు హాజరైన వధూవరులు స్రవంతి, అశేష్

పెళ్లి కుమార్తె సొంత అన్న వేణుగోపాల్. గత రెండు మూడు రోజులుగా పెళ్లి పనులతో తీరిక లేకుండా గడుపుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పాల్వంచలో పెళ్లి అయిపోయిన తరువాత కారులో కందుకూరు బయలుదేరారు. స్వయంగా కారు నడుపుతున్న వేణుగోపాల్ నిద్రమత్తు కారణంగానే ప్రమాదం చోటు చేసుకుందని భావిస్తున్నారు. పెళ్లి పనులతో తీరిక లేకుండా గడిపిన వేణుగోపాల్, విశ్రాంతి తీసుకోకుండా అర్ధరాత్రి కారు డ్రైవింగ్ చేస్తూ రావడమే ప్రమాదానికి కారణమని బంధువులు చెప్తున్నారు. ఈ ప్రమాదంలో వేణుగోపాల్‌కు తీవ్ర గాయాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. మరోపక్క అటు తల్లిని కోల్పోయి, ఇటు అన్న హాస్పిటల్ పాలైన కొత్త పెళ్లి కూతురుకు సంతోషమనేది లేకుండా పోయింది.

**శ్మశానం వద్ద విషాదం**

ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురిని గురువారం రాత్రి గుర్రవారంపాలెం సమీపంలోని శ్మశానంలో ఖననం చేశారు. దీంతో అక్కడి పెద్ద ఎత్తున చేరుకున్న బంధువులు పెద్ద ఎత్తున రోధించారు. పెళ్లికని వచ్చి తిరిగి రాని లోకాలకు వెళ్లారంటూ కన్నీటి పర్యంతమైయ్యారు.

# చెక్‌పోస్టుల వద్ద గస్తీ పటిష్టం



చెక్‌పోస్టు వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- రాత్రి వేళ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

సింగరాయకొండ(మర్రిపూడి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద రాత్రి వేళ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని జాతీయ రహదారిపై పెరల్ డిస్టిలరీ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని గురువారం సాయంత్రం కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాల సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద మూడు షిఫ్టుల్లో ఐదుగురు చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. రోజూ ఒక్కో షిఫ్ట్‌లో 200 చొప్పున వాహనాలు తనిఖీ చేస్తున్నారన్నారు. అయితే ఇప్పటి వరకు భారీ మొత్తంలో నగదు దొరకలేదని చెప్పారు. చెక్‌పోస్టు రికార్డులు తనిఖీ చేశారు. మూలగుంటపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 4 పోలింగ్ కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని 4 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేసి అధికారులకు తగిన సూచనలిచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలని చెప్పారు. కొండపి ఈఆర్‌ఓ ఎ.కుమార్, తహసీల్దార్ భవాని శంకర్, ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఎంఈఓ బి.శివన్నారాయణ, ఆవుల శ్రీనివాసరావు, ఏఎస్‌ఓ శ్రీనివాసరావు, అశోక్, ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా, గ్రామ సచివాలయం-3 సెక్రటరీ సుశీల, సిబ్బంది పాల్గొన్నారు.

# ‘గుండ్లకమ్మ’లో మొసలి కళేబరం



మృతి చెందిన మొసలిని పరిశీలిస్తున్న మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి, అధికారులు

మద్దిపాడు: గుండ్లకమ్మ రిజర్వాయర్‌లోచేపల కోసం మత్స్యకారులు వేసిన వలకు మొసలి కళేబరం చిక్కడం కలకలం రేపింది. మద్దిపాడు మండలంలోని మల్లవరం వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో బుధవారం సాయంత్రం అన్నంగి గ్రామానికి చెందిన మత్స్యకారులు చేపల కోసం వల వేశారు. గురువారం ఉదయం రిజార్వాయర్ వద్దకు చేరుకున్న వారికి వలలో చిక్కుకుని మృతి చెందిన మొసలి కనిపించడంతో ఆందోళన చెందారు. వెంటనే మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖరరెడ్డికి సమాచారం అందించగా హుటాహుటిన వచ్చి పరిశీలించారు. మొసలి కళేబరాన్ని ఫారెస్టు అధికారులకు అప్పగించారు. ఒంగోలు పశువైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఫారెస్టు బీట్ ఆఫీసర్ శశిభూషణ్ తెలిపారు. మత్స్యశాఖ ఏడీ ఉషాకిరణ్, ఎఫ్‌డీఓ ఆశా, పలువురు మత్స్యకారులు ఉన్నారు.

**అది తీరంలో కనిపించిన మొసలే..**

ఇటీవల కొత్తపట్నం మండలం వజ్జిరెడ్డిపాలెం తీరంలో కనిపించిన మొసలే.. గుండకమ్మలో మృతి చెందినట్లు మత్స్యశాఖ జేడీ ధ్రువీకరించారు. మొసలి నోటికి తాడు కట్టి ఫారెస్టు అధికారులకు అప్పగించి, ఒడిశా సమీపంలోని హేచరీకి తరలించాలని సూచించగా వారు సమీపంలో మడుగులు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారని చెప్పారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో వేయవద్దని ఆరోజే స్పష్టం చేశామని, మొసలిని ఒడిశా తరలించలేక రిజర్వాయర్‌లో వదిలేసి ఉండవచ్చన్నారు.

# ఎరిక్షన్.. ఆపు నీ యాక్షన్!

- రోజుకో గిమ్మిక్కు చేస్తున్న వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు
- టీడీపీ కార్యకర్తలకే కండువాలు కప్పి వైఎస్సార్ సీపీ వారిగా ప్రచారం
- ఛీదరించుకుంటున్న సొంత పార్టీ నేతలు
- కుప్పిగంతులన్నీ టికెట్ నిలబెట్టుకోవడానికేనని విమర్శ



యర్రగొండపాలెం: వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తమ అధినేత చంద్రబాబు వద్ద మెప్పు పొంది, టికెట్ నిలబెట్టుకోవడం కోసం రోజుకో గిమ్మిక్కు చేస్తున్నారని సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. టీడీపీ సానుభూతిపరులకే కండువాలు కప్పి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు చేరినట్టుగా ఎరిక్షన్‌బాబు కలరింగ్ ఇవ్వడాన్ని తప్పుబడుతున్నారు. టికెట్ దక్కించుకున్న పార్టీ అభ్యర్థులు నియోజకవర్గంలో పర్యటించకుండా నిర్లక్ష్యం వహిస్తే.. కొత్తవారికి టికెట్ కేటాయిస్తామని టీడీపీ అధిష్టానం నుంచి సంకేతాలు అందడంతో ఎరిక్షన్‌బాబు రోజుకో గ్రామంలో పర్యటించి పార్టీని బలోపేతం చేస్తున్నట్లు నటిస్తున్నాడని ఆ పార్టీ నేతలే బాహాటంగా చెప్పడం గమనార్హం. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు వేసిన టీడీపీ సానుభూతిపరులకు కండువాలు కప్పడం చర్చనీయాంశమైంది. గ్రామాల్లో కూలీ పనులు చేసుకునే వారు, గిరిజనులకు మాయమాటలు చెప్పి టీడీపీలో చేరినట్లుగా పార్టీ అధిష్టానానికి ఫొటోలు పంపడం అవివేకమని ఆ పార్టీకి చెందిన కీలక నాయకుడు వ్యాఖ్యానించారు. టీడీపీ శ్రేణులను సమన్వయం చేయలేకపోవడం, సీనియర్ నాయకుడు డాక్టర్ మన్నె రవీంద్ర, బూదాల అజితారావు వర్గాన్ని పూర్తిగా విస్మరించడం, గుట్టుచప్పుడు కాకుండా ఏదో ఒక గ్రామానికి వెళ్లి ప్రచారం పేరుతో హడావుడి చేయడం తమ పార్టీ ఓటమికి సంకేతాలని టీడీపీ నేతలు పేర్కొంటున్నారు. ఎన్నికలు ముగిసిన మరుసటి రోజే నియోజకవర్గం నుంచి ఎరిక్షన్ బాబు బిచానా ఎత్తివేస్తాడని, లేదంటే కౌంటింగ్ జరిగిన రోజు నియోజకవర్గ టీడీపీ శ్రేణులే ఆయనను తరిమేస్తారని చెప్పారు.

# మోసగాళ్లకు కొమ్ముకాస్తారా?

- పచ్చ కూటమికి ఎమ్మార్పీఎస్ మద్దతివ్వడం మతి లేని చర్య
- మాదిగలకు చంద్రబాబు చేసిన అన్యాయం మరిచారా?
- సీఎం వైఎస్ జగన్ పాలనలోనే మాదిగలకు అన్ని విధాలా న్యాయం
- వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చేదూరి కన్నా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యర్రగొండపాలెం: ఎమ్మార్పీఎస్‌కు చెందిన కొంతమంది నాయకులు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి కొమ్ముకాయడాన్ని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు చేదూరి కన్నా తప్పుబట్టారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు తన వర్గీయులతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడాన్ని ఖండించారు. పచ్చ కూటమి ప్రలోభాలకు లొంగిన కొందరు ఎమ్మార్పీఎస్ నాయకులే వైఎస్సార్ సీపీకి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ గెలిస్తే రాష్ట్రంలో మాదిగలు గెలిచినట్టేనన్న విషయాన్ని విమర్శలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. ఎస్సీల అభ్యున్నతికి జగనన్న ఎనలేని కృషి చేశారని, తన కేబినేట్‌లోనూ స్థానం కల్పించారని గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ పాలనలో ఎస్సీలు అనేక ఇబ్బందులకు గురయ్యారని, మాదిగలుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఏ విధంగా మరచిపోతామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుందామని మాదిగలకు పిలుపునిచ్చారు. వైపాలెం వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తితోపాటు మిగిలిన అసెంబ్లీల అభ్యర్థులు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఆదరించాలని కోరారు. సమావేశంలో పుల్లలచెరువు ఎంపీపీ కె.కోటయ్య, నాయకులు ఎల్.రాములు, జయరావు పాల్గొన్నారు.

# పసి పిల్లలతో ‘పచ్చ’ ప్రచారం



పొదిలిలో పిల్లలకు ప్లకార్డులిచ్చి నినాదాలు చేయిస్తున్న టీడీపీ నాయకులు

పొదిలి: ఎన్నికల ప్రచారంలో 18 ఏళ్లలోపు పిల్లలను వినియోగించవద్దని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా టీడీపీ నేతలు ఖాతరు చేయడం లేదు. తమ ఎన్నికల ప్రచారంలో బాలలకు జెండాలు, ప్లకార్డులు ఇచ్చి యథేచ్ఛగా వెంట తిప్పుకొంటున్నారు. మార్కాపురం టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి తనయుడు విష్ణుష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పొదిలి టౌన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో చిన్న పిల్లలతో ప్లకార్డులు పట్టించారు. పసిపిల్లల మనసులో విష బీజాలు నాటే ప్రయత్నం చేస్తున్న టీడీపీ నేతల తీరుపై స్థానికుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమయ్యాయి. జిల్లా ఎన్నికల అధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# వైఎస్సార్ సీపీలోకి 50 కుటుంబాలు



టీడీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేపీ

రాచర్ల: మండలంలోని చోళ్లవీడు గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరులు 50 బీసీ వడ్డెర కుటుంబాలు మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డి సమక్షంలో గురువారం రాత్రి పార్టీలో చేరారు. వారికి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. గిద్దలూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి విజయానికి కృషి చేస్తామని వివరించారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తమ్ముడు కేపీ కృష్ణమనోహర్‌రెడ్డి, చల్లా రంగస్వామి, చల్లా రంగనాయకులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్ర గాయాలు

మద్దిపాడు: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం ఉదయం 11 గంటల సమయంలో గుండ్లాపల్లి వద్ద జాతీయరహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే..కొత్తపట్నం మండలం మండలం వజ్జిరెడ్డిపాలెంకు చెందిన మణి అనే యువకుడు ఒంగోలు నుంచి మేదరమెట్ల వైపు వెళుతూ గుండ్లాపల్లి ఫ్లైఓవర్ వద్ద ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో బైక్ నుజ్జు నుజ్జు కాగా యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని 108 వాహనం ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ప్రమాద సమయంలో యువకుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు స్థానికులు తెలిపారు. మద్దిపాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేస్తున్నారు.

### జాతీయ కబడ్డీ జట్టుకు సిపోరా ఎంపిక



సిపోరా

సింగరాయకొండ(మర్రిపూడి): జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలికల కబడ్డీ జట్టుకు సింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.సిపోరా ఎంపికైంది. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించిన 49వ ఏపీ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరచి సిపోరా ఎంపికైనట్లు హెచ్‌ఎం డీవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఈనెల 31వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు బీహార్ రాజధాని పాట్నాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సిపోరా పాల్గొంటుందని పీడీ పి.హజరత్తయ్య పేర్కొన్నారు. సిపోరాను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.